క్లుప్తంగా

మొక్కలు కానుకగా ఇచ్చుకోవాలి



రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వ్యర్థాలను తొలగిద్దాం అనే అంశంపై మాట్లాడుతున్న ప్రభావతి

సఖినేటిపల్లి: గృహాల్లో నిర్వహించుకునే శుభకార్యాలకు, పుట్టినరోజు వేడుకలకు పర్యావరణానికి మేలు చేకూర్చే మొక్కలను కానుకగా ఇచ్చుకోవాలని ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి అన్నారు. శుక్రవారం రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీ ఎన్జీసీ, ఏపీ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరుగుచున్న ఏడు రోజులు షెడ్యూల్‌లో భాగంగా మూడో రోజున వ్యర్థాలను తొలగిద్దాం అనే అంశంపై విద్యార్థులకు, గ్రామ పెద్దలకు, ఉపాధిహామీ కార్మికులకు ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యర్థాలను ఏ విధంగా వేరు చేయాలో, తడి చెత్త, పొడి చెత్తలను ఏ విధంగా రీ సైక్లింగ్ చేయాలో ఆమె వివరించారు. ప్రధానంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం గురించి ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు బదులుగా పాత చీరలను సంచులుగా మలుచుకోవడం వల్ల పర్యావరణాన్ని కొంత వరకూ కాపాడిన వారమవుతామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రామంలో అవగాహన ర్యాలీ కూడా ఆమె నిర్వహించారు. సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం ఎంజీకె శ్రీనివాస్, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో నాగేంద్ర ప్రసాద్, విద్యాకమిటీ సభ్యులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల బహూకరణ



సీసీ కెమెరాలు అందిస్తున్న కారుపల్లి తానాజీ

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహ భద్రత కోసం గ్రామ ఎస్సీ సంక్షేమ సంఘం సభ్యులు కారుపల్లి తాతయ్య మాస్టారు కుమారుడు కారుపల్లి తానాజీ సుమారు 20 వేల విలువైన నాలుగు సీసీ కెమెరాలు బహుమతిగా అందజేశారు. స్థానిక సంఘ అధ్యక్షులు చెవ్వాకుల సుందరరావు, జై భీమ్ యూత్ అధ్యక్షులు బోస్ నరేష్‌లకు తానాజీ అందజేశారు. ఈ సందర్భంగా తానాజీని గ్రామ ఎస్సీ సంక్షేమ సంఘం, జై భీమ్ అభ్యుదయ యువజన సంఘం, గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ ఎస్సీ సంక్షేమ సంఘం కార్యదర్శి కారుపల్లి శ్రీనివాస్, చైర్మన్ దొండపాటి రాంబాబు, కోశాధికారి పెదపాటి ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

నిండుశోకంతో ఇమామ్ బాకర్‌కు నివాళి



గుమ్మటం ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లిం ఆరాధ్య దైవం అయిదో ప్రవక్త హజరత్ ఇమామ్ మహ్మద్ బాఖర్‌కు ముస్లింలు శుక్రవారం నిండు శోకంతో నివాళులర్పించారు. దీనిలో భాగంగా నగరం గ్రామంలోని బార్గాహే పంజతన్‌లో మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకుడు సయ్యద్ అబ్బాస్ బాఖరి మజ్లిస్ ఆలపించారు. ఇమామ్ బాకర్ జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలను, అతని గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. మీర్ జుల్ఫీకర్ అలీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అనంతరం పంజా నుంచి గుమ్మటాన్ని తీసి ఊరేగించారు. గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. దీంతోపాటు మంజిలే కర్బలాలో కూడా మజ్లిస్ జరిగింది.

బెటర్ లైఫ్ సర్వీస్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవం

మలికిపురం: బెటర్ లైఫ్ సర్వీస్ ఆర్గనైజేషన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా మలికిపురం మండలం శంకరగుప్తం గ్రామం వినాయకుని గుడి వద్ద వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమం లో పలువురు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న సుమారు 181 మంది పేదవారికి ఆర్థిక సాయం చేశారు ఈ సంస్థ ద్వారా జన్మదిన, పెళ్లిరోజు, అన్నప్రసాద నామకరణ వేడుకలు చేసుకొనే వారి వద్ద సేకరించిన రూ.20 లక్షలు సేకరించి కష్టాల్లో ఉండి బ్రతుకుతెరువు కష్టంగా ఉన్న వారికి, ఆరోగ్య సమస్యలతో మంచానికి పరిమితమై ఇబ్బందులు పడుతున్నా అనేక మందికి ఈ సంస్థ ద్వారా సహాయం చేస్తూ గత మూడు సంవత్సరాలుగా సేవలు చేసిన సంస్థ ఫౌండర్ సాగిరెడ్డి గణేష్, ప్రెసిడెంట్ ఆచంట పండు సభ్యులు రేకపల్లి బాబి ముత్యాల జగదీష్, ఆరేటి కృష్ణ, ఆచంట ప్రతాప్, ఆచంట రమేష్ తదితరులను పలువురు ప్రముఖులు ప్రశంసించారు. ఈ సంస్థ ద్వారా మరింత మంది పేదవారికి సహాయం చేయాలని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపాక ఆనంద్ కుమార్, జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణం

- రోజురోజుకూ పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- రహదారులు, పంటకాలువల్లో వ్యర్థాల నిల్వలు
- నిప్పుపెడితే ముప్పంటున్న పర్యావరణ వేత్తలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకూ ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుంది. పర్యావరణాన్ని, పచ్చదనాన్ని ప్లాస్టిక్ రూపంలో మానవాళిని పెను ప్రమాదంలోకి తీసుకువెళుతుంది. భవిష్యత్తు తరాల మనుగడను, జీవన విధానాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. ప్లాస్టిక్ భూతం నుంచి విముక్తి పొందే అవకాశం ప్రజల చేతుల్లో ఉన్నా పట్టించుకోకపోవడం తీవ్ర అనర్థాలకు కారణమవుతుంది. ప్లాస్టిక్ నియంత్రణ, నిషేధం కేవలం ప్రచారానికే పరిమితమవుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. నిర్ణీత మైక్రాన్ల కంటే తక్కువగా ఉండే ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడానికి వీల్లేదంటూ చట్టాలను చేసినప్పటికీ కూడా వాటిని అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా, నిర్లిప్తంగా వ్యవహరిస్తోంది. మార్కెట్ విపణిలో నుంచి నివాస ప్రాంతాలకు చేరుకుంటున్న ప్లాస్టిక్ వ్యర్థాలు నేరుగా రహదారుల పక్కన, పంట కాలువల్లోను, డంపింగ్ యార్డుల్లోకి చేరుతున్నాయి. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో అనేక ప్రదేశాలు డంపింగ్‌యార్డులుగా మారిపోతున్నాయి. ఇరిగేషన్ కాలువ గట్లు కూడా ఇదే విధంగా వినియోగిస్తుండటంతో సాగునీరు పారేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంతమంది నిర్లక్ష్యం వల్ల కాలువల్లో ఎక్కువగా ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు చేరిపోయి సాగునీటి ప్రవాహానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. మురుగు కాలువల్లోకి అనునిత్యం చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల శివారు ప్రాంతాలకు సక్రమంగా సాగునీరు అందకపోవడంతో పాటు పశువులకు తీవ్ర హానీ చేస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దాదాపు అన్ని ప్రధాన, పంట కాలువల్లో వాటర్ ప్యాకెట్లు, వాటర్, కూల్‌డ్రింక్ బాటిళ్లు, డిస్పోజబుల్ ప్లేట్లు, గ్లాసులు, క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ తాళ్లు, చెప్పులు వినియోగం రోజు రోజుకు పెరిగిపోతుండటం పర్యావరణానికి పెను విఘాతంగా మారింది.

ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెడితే ముప్పు

మూడు నియోజకవర్గాల పరిధిలోని 184 గ్రామ పంచాయతీల పరిధిలోని నివాస గృహాల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులోకి చేర్చి, నిప్పు పెడుతున్నారు. దీని వల్ల అత్యంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ తదితర వస్తువులు సైతం కాలిపోయి గాలి కాలుష్యం పెరిగిపోతోంది. పాలీ బ్యాగులతో పాటు ప్లాస్టిక్ మెటీరియల్‌ను కూడా నేరుగా డంపింగ్ యార్డుల్లోనే పడేస్తున్నారు. వీటిలో శానిటరీ న్యాప్‌కీన్స్ మొదలుకుని, ఆసుపత్రి వ్యర్థాల వరకూ ఉండటాన్ని బట్టి పరిస్థితి ఎంత తీవ్ర స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఎటువంటి పర్యవేక్షణ, నియంత్రణ లేకుండా ఇలా డంపింగ్ యార్డుల్లోకి చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా ఆ ప్రదేశాల్లో భూమి, నీరు, గాలి కలుషితమవుతోంది. ఫలితంగా మానవాళికి అనేక అంటు వ్యాధులకు, అనారోగ్యానికి కారణమవుతుంది.



వెదురుమూడి పంటకాలువను ముంచెత్తుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు



సంధిపూడిలో రోడ్డు పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అక్కరకు రాని తడి చెత్త–పొడి చెత్త

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన తడి చెత్త–పొడి చెత్త విధానం అక్కరకు రాకుండా పోతుంది. ఆవాస ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను పర్యావరణ హితంగా డీ కంపోజ్ చేసేందుకు ప్రభుత్వం యంత్రాంగం ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. అందులో భాగంగా గ్రామాల్లో ఇళ్ల వద్దే సేకరించిన తడి, పొడి చెత్తను ఎరువులను తయారు చేయాలని సంకల్పం ఆచరణలో సాధ్యం కావడం లేదు. అందులో వచ్చే ప్లాస్టిక్ వస్తువులను వేరు చేసి పునర్వినియోగ వస్తువులుగా తయారు చేయాల్సి ఉంటుంది. ప్రతి రోజూ టన్నుల కొద్దీ పెరిగిపోతున్న చెత్తను సక్రమంగా రీసైక్లింగ్ చేయడంలో అధికారులు సక్రమంగా వ్యవహరించడంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృతంగానే ప్రచారం జరుగుతున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

స్వచ్ఛందంగా నియంత్రణ పాటించాలి



ప్రజా జీవితంలో ప్రతి ఒక్కరికి పర్యావరణాన్ని రక్షించవలసిన బాధ్యత ఉంది. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన అత్యవసరంపై ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించాలి. వినియోగదారులు సైతం అవగాహన పెంచుకుని ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి వీలైనంత దూరంగా ఉండేందుకు ప్రతి వినియోగదారుడు ప్రయత్నించాలి.

– చిన్నం వీర్రాఘవ, ఆలమూరు

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలి



ప్లాస్టిక్ వినియోగాన్ని అందరూ స్వచ్ఛందంగా తగ్గించుకోవాలి. మార్కెట్లను వివిధ రకాల ప్లాస్టిక్ వస్తువులు ముంచెత్తుతున్నాయి. వినియోగానికి సౌకర్యవంతంగా ఉండడంతో ప్రజలు వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. అంతిమంగా వచ్చే ప్రమాదాన్ని మాత్రం గుర్తించడం లేదు. ప్లాస్టిక్ నియంత్రణపై వైద్యారోగ్య సిబ్బంది చేత విరివిగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

– ఏవీవీ రాజా, హెల్త్ ఎడ్యుకేటర్, పెదపళ్ల పీహెచ్‌సీ

స్వామివారి సన్నిధిలో అమలాపురం ఆర్డీవో



అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఆర్డీవో కేశవవర్ధన్‌రెడ్డి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం అమలాపురం ఆర్డీవో జి.కేశవ వర్ధన్ రెడ్డి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది అందజేశారు. రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వి.రామరాజు, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గిడ్డిని కలసిన వైద్యాధికారులు



పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డిని కలసిన నాగుల్లంక పీహెచ్‌సీ వైద్య బృందం

పి.గన్నవరం: ఎమ్మెల్యేగా ఎన్నికైన గిడ్డి సత్యనారాయణను నాగుల్లంక పీహెచ్‌సీ వైద్య బృందం శుక్రవారం మర్యాద పూరకంగా కలిశారు. ఎమ్మెల్యేను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వైద్యాధికారులు షేక్ జాసిమ్, మహమ్మద్ తున్నిషా బేగం, వై.ప్రియాంక, ఆర్.మౌనిక, ఎంపీహెచ్ఈఓలు ఎ.నాగరాజు, శ్రీనివాసరెడ్డి, ఎంపీహెచ్ఎస్ బీవీవీఎస్ఎన్ మూర్తి, ఎం.శామ్యూల్‌రాజు, వైద్య సిబ్బంది ఎమ్మెల్యేను కలసిన వారిలో ఉన్నారు. అలాగే నియోజకవర్గం నలుమూలల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గిడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలోని తొగరపాయ వద్ద ఉన్న శ్మశాన వాటిక ఆక్రమణకు గురైందని ఆ గ్రామంలోని వారా వారిపేటకు చెందిన పలువురు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీవీ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఓ పక్క తొగరపాయ వరద నీటి ప్రభావం వల్ల శ్మశాన వాటిక రహదారి కుంగిపోతుండగా మరోపక్క కొలు రైతు శ్మశానవాటిక రహదారిని బొప్పాయి పంట వేసి రక్షణగా దడి కట్టి ఆక్రమించుకుటున్నట్లు వారు ఆరోపించారు. మొత్తం మీద మృతదేహాలను పూడ్చి పెట్టడానికి స్థలం లేదన్నారు. అధికారులు శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలు తొలగించవలసిందిగా కోరుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పాటు ఫిర్యాదు ప్రతులను అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌కు, మండల పరిషత్ కార్యాలయంకు అందించినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో కొంకి వెంకట్రావు, ఎంఎం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు పాటించాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

సాకారమైన హిమాన్షు శుక్లా రామసేతు వారధి

- రూ.1.01 కోట్లతో నిర్మాణం
- 15 రోజుల్లో పనుల పూర్తి



వాడ్రేవుపల్లి డ్రైన్‌పై నిర్మించిన హిమాన్షు శుక్లా రామసేతు వారధి

మామిడికుదురు: క్షణక్షణం, భయం, భయంగా మారి రైతులను తీవ్ర కలవర పాటుకు గురి చేసిన శిథిల వంతెన స్థానే పక్కా వారధి నిర్మాణం సాకారమైంది. రికార్డు స్థాయిలో రెండు నెలల వ్యవధిలోనే ఈ వారధి నిర్మాణం పూర్తి చేసి రికార్డు సృష్టించారు. వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై పాశర్లపూడిలంక–లూటుకుర్రు గ్రామాల మధ్య రూ.1.01 కోట్ల వ్యయంతో ఈ వారధి నిర్మించారు. కలెక్టర్ కృషి ఫలితంగా నిర్మించిన ఈ వారధికి 'హిమాన్షు శుక్లా రామసేతు వారధి'గా నామకరణం చేశామని పీఆర్ డీఈఈ (ప్రాజెక్టు) అన్యం రాంబాబు శుక్రవారం తెలిపారు. కలెక్టర్ చొరవతోనే మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన అప్పనపల్లిలో పాటురేవు పాయపై వంతెన నిర్మించారు. దానికి సైతం 'శుక్లా వారధి'గా నామకరణం చేయడం విశేషం.

నిధులు మంజూరు ఇలా..

పాశర్లపూడిలంక, లూటుకుర్రు గ్రామాలతో పాటు మరో అయిదు గ్రామాలకు చెందిన ప్రజల అభ్యర్థన మేరకు కలెక్టర్ శుక్లా వారధి నిర్మాణం స్థితిగతులపై అధ్యయనం చేశారు. శిథిల వంతెన పరిస్థితిని స్వయంగా పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేశారు. ఎంపీ లాడ్స్ నుంచి రూ.25 లక్షలు, జిల్లా పరిషత్ ద్వారా రూ.35 లక్షలు, జిల్లా జనరల్ ఫండ్ నుంచి రూ.41.20 లక్షలు వంతెన నిర్మాణానికి మంజూరు చేశారు. 75 అడుగులు పొడవు, 25.6 అడుగులు వెడల్పుతో ఈ వారధి నిర్మించారు. ఈ వంతెన మీదుగా ఏడు గ్రామాలకు చెందిన సుమారు 15 వేల మంది రాకపోకలు సాగించేందుకు వీలు కలుగుతుంది. దీంతో పాటు భారీ వర్షాల సమయంలో వారధిపై భాగంలోని పంట పొలాలు ఇంత వరకు తీవ్రమైన ముంపు సమస్యను ఎదుర్కొన్నాయి. ఇక నుంచి ముంపు సమస్యకు విముక్తి కలుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పదిహేను రోజుల్లో వారధి నిర్మాణం పనులు పూర్తి అవుతాయని డీఈఈ రాంబాబు తెలిపారు.

మలేరియా జ్వరాలపై అవగాహన



పాశర్లపూడిలంకలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ ఉద్యోగులు

అంబాజీపేట: మలేరియా జ్వరాల వ్యాప్తి, నిర్మూలనపై ప్రజలకు సీహెచ్‌వో బి.అప్పారావు, పీహెచ్ఎన్ రత్నకుమారి, హెచ్‌వీ శాంతకుమారిలు అవగాహన కల్పించారు. మాచవరం, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీటకాలు అన్నింటిలో దోమలు అత్యంత ప్రమాదకరమన్నారు. వీటి వల్ల మలేరియా, డెంగీ, జ్వరాలు ప్రబలుతాయని దోమల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలన్నారు. మలేరియా, డెంగీ దోమలు ఇళ్ల వద్ద మంచినీరు నిల్వ ఉండే తొట్టెలు, డ్రమ్ములు, వాడేసిన టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లు, పూలకుండీలు, ఫ్లవర్‌వాజ్‌ల్లో పెరుగుతాయన్నారు. వారినికోసారి పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాశర్లపూడిలో..

మామిడికుదురు: లూటుకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని పాశర్లపూడిలంకలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఉద్యోగులు సూచించారు. నివాస ప్రాంతాల్లో ముంపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని, ముంపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయిల్ వ్యర్థాలను మురికి నీటి నిల్వలపై చల్లడం ద్వారా దోమల లార్వాలకు ఆక్సిజన్ అందకుండా చేసి దోమల పెరుగుదలను నివారిస్తుందని హెల్త్ అసిస్టెంట్ ఏడిద కవి న్నారు. ఏఎన్ఎం కస్తూరి, ఎంపీహెచ్ఈఓ ప్రసాద్, ఆశ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

నివారణకు కృషి చేయాలి

ఆలమూరు: ప్రాణాంతక మలేరియా వ్యాధి నివారణకు అందరూ కృషి చేయాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ప్రధాన వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైద్యారోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు, మలేరియా వ్యాధి వ్యాప్తి–నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. జ్వరపీడితులు సత్వరమే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రక్తపరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలి



అయినవిల్లిలంకలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు

అయినవిల్లి: ఉపాధిహామీ పనులను పారదర్శంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని అయినవిల్లిలంకలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని కోడూరి రామకృష్ణ తోటలో కొబ్బరితోటలో ఉపాధిహామీ పనుల్లో భాగంగా చేస్తున్న కొబ్బరి పళ్లాల తవ్వకం పనులను పరిశీలించారు. మొక్కల నాటే పనులను ఆయన పరిశీలించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ కుమ్మరి నాగవేణి మాధవీలలిత, ఎంపీటీసీ దాసరి శైలజ, ఉప సర్పంచ్ చిట్టూరి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రేమళ్ల సూర్యనారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న యోగా విద్యార్థులు

28 మంది రోగులకు 34 మంది రక్తదానం



అమలాపురంలో రక్తదానం చేస్తున్న యువకులతో శ్రీనివాస్

కొత్తపేట: వివిధ వ్యాధులతో బాధపడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన 28 మందికి కొత్తపేట వివేకానంద యోగా ఆశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 34 మంది విద్యార్థులు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులకు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి, వివిధ ప్రమాదాలకు గురై కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తలసేమియా రోగులు 28 మందికి అత్యవసరంగా రక్తం ఎక్కించవలసి వచ్చింది. దాంతో ఆయా రోగుల బంధువులు యోగా మాస్టర్ ఆకుల శ్రీనివాస్‌ను ఆశ్రయించగా ఆయన తన యోగా ఆశ్రమం, వ్యాయామ కళాశాల్లో స్టూడెంట్స్, యువకులు వి.గౌతమ్‌రాజ్, పి.శ్రీను, జె.సతీష్‌కుమార్, ఎస్.చంద్రశేఖర్ తదితర 34 మందిని సమీకరించారు. వారిలో గురువారం కొంతమంది, శుక్రవారం కొంతమందితో రక్తదానం చేయించి, పై రోగులకు అందజేసినట్టు యోగా మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తమ సంస్థల ద్వారా సుమారు 16 వేల మందికి రక్తదానం చేసినట్టు తెలిపారు. ఆయా రోగుల బంధువులు శ్రీనివాస్‌కు, రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే బండారుకు అభినందనలు



వాడపాలెంలో ఎమ్మెల్యే బండారును అభినందిస్తున్న షరీఫ్ తదితరులు

కొత్తపేట: ఎమ్మెల్యేగా విజయం సాధించిన బండారు సత్యానందరావును ముస్లింలు మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ మీరాన్ షరీఫ్ ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు ఎమ్మెల్యే స్వగ్రామం వాడపాలెం వెళ్లి ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షామఅబ్బు, సభ్యులు షేక్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు సంతకంపై హర్షం



రాజోలులో హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

రాజోలు: న్యాయవాదులు గత కొన్ని నెలలుగా పోరాటం చేస్తున్న ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు రెండో సంతకం చేయడంపై రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు నిర్ణయం న్యాయవాదుల విజయంగా పలువురు సీనియర్ న్యాయవాదులు ప్రసంగించారు. ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్, న్యాయవాదులు పొన్నాడ సూర్యారావు, కె.పి.ఆర్.నాయుడు, మైలవరపు రవిరామ్, మామిడిశెట్టి శ్రీనివాసరావు, జాలెం భాస్కరరావు, ఆచంట శ్రీనివాస్, చెల్లింగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

రావులపాలెం: ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మొదటి సంతకంతోనే అయిదు హామీలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో సత్యానందరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అందులో భాగంగా ఐదు సంతకాల్లో తొలుత నిరుద్యోగ యువతకు బాసటగా మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ రూ.4 వేలు, పేదలకు రూ.5 లకే కడుపు నింపేందుకు అన్నా క్యాంటీన్‌ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సెస్‌పై సంతకాలు చేసి దానికి అనుగుణంగా పరిశ్రమలు తెచ్చేందుకు పాటు పడుతున్నారన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ మెజారిటీ అందించిన నియోజకవర్గ ప్రజానీకానికి ఆయన కృతజ్ఞతలు తెలిపి వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తామని ఎమ్మెల్యే బండారు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

అంబాజీపేట: గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ జీవీ సరోవర్ సచిఎల య ఉద్యోగులకు సూచించారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఉద్యోగ బాధ్యతలను స్వీకరించిన ఎంపీడీవోను సచివాలయ ఉద్యోగులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయంలో ఉద్యోగులంతా సమయపాలన పాటించాలన్నా రు. సచివాలయానికి వచ్చే వారి పట్ల సఖ్యతగా మెలిగి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపేట: మండలంలోని అవిడి గ్రామంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ శుక్రవారం సా యంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నందు 11 కేవీ లైన్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

శివకోడులో..

రాజోలు: రాజోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన శివకోడు గ్రామంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. అమలాపురం డీఈఈ ఎం.రవికుమార్ ఆదేశాల మేరకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు.